

జేఎన్టీయూకే అభివృద్ధికి నావంతు కృషిచేస్తా - 7లో

- ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ మురళీకృష్ణ





కాకినాడ-ఉప్పాడ మధ్యలో అల్లకల్లోలంగా ఉన్న సముద్రం

అరెరే వాన.. జడి వాన..

- వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా వానలు
- శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు కురుస్తూనే ఉన్న వర్షం
- నేడు పూరీ వద్ద వాయుగుండం తీరం దాటనుండడంతో భారీ వర్ష సూచన
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్‌కు సూచించిన సీఎం చంద్రబాబు
- ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో పలుచోట్ల ఆకుమడులు నీటమునక
- ఎగువ నుంచి వస్తున్న వరదతో ఏలేరు, పంపా, సుబ్బారెడ్డిసాగర్‌కు భారీ ఇన్‌ఫ్లో
- వాయుగుండంతో తీరం అల్లకల్లోలం: ఉప్పాడ బీచ్‌రోడ్డును బలంగా తాకిన అలలు
- సముద్రంలో గాలులతో రెండోరోజూ విదేశాలకు నిలిచిన బియ్యం ఎగుమతులు
- అత్యధికంగా కోటనందూరులో 3.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

సామర్లకోటలో ఇళ్లస్థలాల కాలనీలో పడుతున్న వాన

వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారడంతో దాని ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు పలుచోట్ల మోస్తరు నుంచి భారీగా వర్షం పడింది. అనేక మండలాల్లో రోజంతా జల్లులతో కూడిన వాన కురుస్తూనే ఉంది. దీంతో జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి.

కాకినాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలంలో వర్షపాతం జిల్లాలోనే అధికంగా నమోదవడంతో ఇక్కడ శుక్రవారం పగటిపూట ఉష్ణోగ్రత 27 డిగ్రీలకు పడిపోయింది. కాగా వాయుగుండం శనివారం ఉదయానికి ఒడిషా సమీపంలోని పూరీ వద్ద తీరం దాటనుంది. ఈ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా శనివారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని రాష్ట్రవిపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మరోపక్క గోదావరిలో వరద ఉధృతి పెరుగుతుండడం, అటు శనివారం భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలతో సీఎం చంద్రబాబు శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షాన్ మోహన్‌ను ఆదేశించారు. కాలువలు, వాగుల్లో వరద ప్రవాహం పెరిగి గండ్లు పడే ప్రమాదం ఉన్నందున ఇసుక బస్తాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. కంట్రోల్‌రూంల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కాగా వాయుగుండం ప్రభావంతో కాకినాడ జిల్లా కేంద్రంలో ఉదయం నుంచి రాత్రి వరకు శుక్రవారం భారీగా వర్షం కురిసింది. రోజంతా ముసురు వాతావరణం నెలకొని చీకటిగా మారింది. ఫలితంగా ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది. లోతట్టుప్రాంతాల్లో నీరు చేరిపోయింది. కాకినాడ ఆర్టీసీ బస్టాండ్ చుట్టూ వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. అటు వాయుగుండం ప్రభావంతో కాకినాడ తీరం అల్లకల్లోలంగా మారింది. ఉప్పాడవద్ద రాకాసి అలలు బీచ్‌రోడ్డును బలంగా తాకాయి. దీంతో బీచ్ రోడ్డులో రాకపోకలు తగ్గిపోయాయి. సముద్రంలో ఈదురుగాలుల ప్రభావం అధికంగా ఉండడంతో రెండోరోజూ కాకినాడ యాంకరేజ్‌పోర్టు నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. మొత్తం 8విదేశీ నౌకల్లోకి లోడింగ్ ఆగిపోయింది. వందలాది బోట్లు సముద్రంలో వేట విరమించుకుని ఒడ్డుకు చేరుకున్నాయి. అలల తీవ్రతకు బోట్లు ఒకదానికొకటి బలంగా ఢీకొనడంతో హార్బర్ పరిసరాల్లోని మత్స్యకారులు ఆందోళన చెందారు.

రిజర్వాయర్లలోకి భారీ ఇన్‌ఫ్లో

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో పలుచోట్ల నారుమడులు నీటమునిగిపోయాయి. వీటిని కాపాడుకునేందుకు అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. అటు రిజర్వాయర్లలోకి ఎగువనుంచి భారీగా నీరు చేరుతుండడంతో ఇన్‌ఫ్లో అంతకంతకూ పెరుగుతోంది. ప్రత్తిపాడు మండలంలోని సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టుకు కుంతీదేవి వాగునుంచి శుక్రవారం 0.23 టీఎంసీల నీరు చేరింది. ఏలేరు రిజర్వాయరులో ప్రస్తుతం 6.5టీఎంసీల నీరు నిల్వ ఉండగా, వర్షాలకు శుక్రవారం 314 క్యూసెక్కులు, గోదావరి వరద ద్వారా 875 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. పంపా రిజర్వాయరులోకి ఇన్‌ఫ్లో 0.5టీఎంసీలుగా నమోదైంది. రానున్న మరో రెండురోజుల్లో ఈ రిజర్వాయర్లలోకి వరద నీరు మరింత భారీగా వచ్చి చేరనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

చెరువులను తలపిస్తున్న పేదల కాలనీలు

మరోపక్క ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో పలుచోట్ల పేదల ఇళ్ల లే అవుట్లు నీటమునిగిపోయాయి. గత ప్రభుత్వంలో లోతట్టు ప్రాంతాల్లో స్థలాలు కొని పేదలకు అంటగట్టిన కాలనీల్లో వర్షపునీరు చేరడంతో అవన్నీ చెరువులను తలపిస్తున్నాయి. దీంతో అక్కడున్న జనం నానా ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే సామాన్లు సర్దుకుని వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. కాగా శుక్రవారం రోజంతా కురిసిన వర్షాలతో అత్యధికంగా కోటనందూరు మండలంలో 3.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెదపూడి 2.7, కిర్లంపూడి 2.6, శంఖవరం 2.3, తొండంగి 2.1, ప్రత్తిపాడు 1.8, తుని 1.5, ఏలేశ్వరం 1.5, పిఠాపురం 1.3, కాకినాడరూరల్ 1.1, పెద్దాపురం 1.1, యు.కొత్తపల్లి 1.1, తాళ్లరేవులో ఒక సెంటీమీటరు వర్షపాతం నమోదైంది.



పిఠాపురం మండలం జల్లూరు శివారు వరిపొలంలో నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న అధికారులు



కరపలో వర్షాలకు నీట మునిగిన ఆకుమడి



తాళ్లరేవు మండలం పి.మల్లవరం గ్రాంటులో ముంపునకు గురైన వరినాట్లు

తుఫానుపట్ల అప్రమత్తంగా ఉండాలి

- జూమ్‌కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ఆదేశాలు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 19: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను కారణంగా జిల్లా అధికారులను అప్రమత్తం చేసేందుకు శుక్రవారం ఉండవల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంనుంచి సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్‌నుంచి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులతో కలిసి హాజరయ్యారు. విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లేకుండా చూడడం ఇబ్బందులు అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానం, బలహీనంగా ఉన్న ఏటిగట్లను ముందుగానే గుర్తించడం, గండ్లను పూడ్చడానికి ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవడం వంటి అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

కాకినాడ రూరల్, జూలై 19: జిల్లావ్యాప్తంగా భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా అన్నియాజమాన్యాల పాఠశాలలకు శనివారం సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో పిల్లి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపవిద్యాశాఖాధికారులు, ఎంఈవోలు ఈ సమాచారాన్ని కాకినాడ డివిజన్, మండల పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియచేయాలన్నారు. ప్రస్తుత సెలవు దినానికి తదుపరి వచ్చేప్రభుత్వ సెలవు దినాల్లో సదరు పాఠశాలలు కంపెన్సేటరీగా పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



వానాకాలం సీజనల్ వ్యాధుల ముప్పు



- వైద్యశాఖలో కానరాని ముందస్తు చర్యలు
- రోగులతో నిండిపోతున్న ఆస్పత్రులు
- డయేరియా, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యాతో ఇబ్బందులు
- అప్రమత్తంగా ఉండడం శ్రేయస్కరం అంటున్న వైద్యులు

ఆస్పత్రుల్లో మంచాన పడ్డ జ్వరపీడితులు(పాతచిత్రం)

సామర్లకోట/తుని రూరల్, జూలై 19: వానాకాలం ముసురుకుంది. ఈ వర్షాకాలంలో వైరస్‌లు, బ్యాక్టీరియా వేగంగా విస్తరిస్తాయి. వర్షాకాలం ప్రారంభంతో వైరస్, బ్యాక్టీరియాలకు జీవం వస్తుంది. చల్లని వాతావరణం ఎక్కడికక్కడ నీటినిల్వలు, కలుషిత నీరు, నిల్వ ఆహారం రోగాల విజృంభణకు రోగాలకు కారణం. వర్షాకాలంలో రోగాలపట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధుల ముప్పు పొంచి ఉండడంతో కొన్ని ప్రాంతాల్లో అధికంగా జ్వరాల బాధితులు కనిపిస్తున్నారు. ఆస్పత్రులు రోగులతో నిండుతున్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చినా యంత్రాంగం ఇంకా జాగ్రత్తపడడంలేదు. వ్యాధుల సీజన్‌లో అప్రమత్తత కొరవడింది.

జిల్లాలో సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నాయి. జ్వరపీడితులు, రోగులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. గతంలో ఏటా వర్షాకాలంనాటికి వైద్య ఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టేది, కానీ గత వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ ప్రణాళికలు నిలిచిపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. వ్యాధుల పెరుగుతున్నా వైద్యఆరోగ్యశాఖ తూతూమంత్రపు చర్యలకే పరిమితమవుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్కడక్కడా డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. సామర్లకోట వంటి పట్టణానికి సైతం డెంగ్యూ ఛాయలు వ్యాప్తి చెందాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఇటువంటి కేసులు వస్తున్నా ప్రభుత్వ ఆస్పత్రులకు రాకుండా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు.

కాకినాడ జిల్లాలో 37 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, 23 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వేలాదిమంది వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏటా వర్షాకాలంలో ముందస్తుగా సీజనల్ వ్యాధులు ఎదుర్కోవడంపై ప్రణాళికలు సిద్ధం చేసేవారు. ఆస్పత్రుల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచేవారు. ఆస్పత్రి సలహా మండలి సమావేశాలు నిర్వహించేవారు. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. ఎక్కడా సన్నద్ధత అనేది కనిపించడం లేదు. దీంతో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలతో పాటు అన్ని రకాల వ్యాధులు ముసురుతున్నాయి. వ్యాధులు, జ్వరాలు పెరగడానికి పారిశుధ్యం క్షీణించడమే కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్య పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. శివారు మండలాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

దోమల విజృంభిస్తే రోగాలు తప్పవు

వర్షాకాలంలో విజృంభించే వ్యాధుల్లో అతిసారా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి ప్రధానమైన వ్యాధులు. వర్షాకాలంలో రోడ్లు, కాలువలు, ఇళ్ల పరిసరాలు ఎక్కడ చూసినా నీటి నిల్వలు ఉంటాయి. ఈ నిల్వలే దోమల వృద్ధికి కారణమవుతాయి. వానాకాలంలో నీరు కలుషితమవుతుంది. అలా నీరు, ఆహారం కలుషితమైన, దోమల విజృంభణతో వ్యాధులు ఖాయం. వర్షాకాలంలో వ్యక్తిగత శుభ్రతతో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి.

- నీరు, ఆహారం కలుషితమైనప్పుడు ఎకోలైన్ చల్లోనెల్లా రోటా వంటి వేల రకాల వైరస్ బ్యాక్టీరీలు శరీరంలోకి ప్రవేశిస్తాయి. డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయి. కొన్ని రకాల వైరస్‌ల వద్ద నీళ్ల విరోచనాలు అవుతాయి. వీటితో పాటు రక్త విరోచనాలు అవుతాయి. ఈ సీజన్‌లోనే వైరల్ జ్వరాలు వస్తాయి. అందువల్ల ఈ సీజన్లో బయట ఆహారం తీసుకోకపోవడం చాలా మంచిది. కాచి చల్లార్చిన, వడపోసిన నీటిని తాగడం ఉత్తమం. ఈ సీజన్‌లో పీడించే జ్వరాల్లో మలేరియా ఒక్కటి. జ్వరాలకు కారణమ్యే ప్లాసోడియం పరాన్న జీవిని వ్యాపించే దోమ నీటి మడుగులు, నీరు నిలిచే ప్రాంతాల్లోనే వృద్ధి చెందుతుంది. దోమకుట్టిన తర్వాత తలనొప్పి, శరీరంపై దద్దుర్లు వస్తాయి. దోమ కుట్టుడంవల్ల ప్లాస్మోడియా పరాన్న జీవి శరీరంలోకి ప్రవేశించి ఎర్రరక్తకణాల్లో ప్రభావం చూపుతుంది. ఇది జరిగిన 10 నుంచి 15 రోజుల్లోపు తీవ్ర జ్వరం బారిన పడతారు. జ్వరం రోజు విడిచి రోజు వస్తుంది. మలేరియా రక్తపరీక్షలు చేయించి తగిన వైద్యం చేయించుకోవాలి. డయేరియా కలుషితాహారం, నీరు తీసుకోవడంవల్ల వచ్చే అవకాశం ఉంది. దీని వల్ల వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి, అధిక దాహం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. వ్యాధి రాకుండా వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించారు. మంచినీటి పైపులైన్ ద్వారా లీకేజీల ద్వారా నీరు కలుషితం కాకుండా చూడాలి.

● అప్రమత్తత అవసరం: తేటగుంట పీహెచ్‌సీ వైద్యురాలు సాహితీ

వాతావరణంలో మార్పులవల్ల జ్వరాలు వస్తాయి. వర్షాలవల్ల దోమ వృద్ధి చెంది కొబ్బరి బొండాలు, పాత టైర్లలో దోమలు వృద్ధి చెందుతాయి. దీంతో రకరకాల జ్వరాలు వస్తాయి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చి వడపోసిన నీటిని మాత్రమే తాగాలి. బయట ఆహారం తినకుండా ఉండమే మంచిది. భోజనానికి ముందు సబ్బుతో చేతులు కడుక్కోవాలి. జ్వరం వస్తే డాక్టర్‌ను సంప్రదించాలి.

- **డెంగ్యూ..** ఈ జ్వరం దోమ కాటువల్ల వస్తుంది. హైఫీవర్, కనుగుడ్డు వెనుక నొప్పి, కండరాలు పట్టివేత, శరీరం రద్దుర్లు వస్తాయి. ఈ జ్వరాన్ని ఎలిషా టెస్ట్ ద్వారా గుర్తిస్తారు.
- **చికెన్‌గున్యా...** ఇది దోమ కాటు వల్ల వచ్చే జ్వరం. ఉన్నట్టుండి జ్వరం ఎక్కువగా వచ్చి చలి వస్తుంది. తలనొప్పి, కీళ్ల నొప్పులు ఉంటాయి. వ్యాధి నిరోధకశక్తి తగ్గకుండా మందులు, ఆహారం తీసుకోవడం ద్వారా తగ్గించుకోవచ్చు.
- **మలేరియా..** తీవ్ర జ్వరం, తలనొప్పి, వాంతులు వచ్చినట్లు ఉండడం. మూత్రం రంగు మారుతుంది. ఇందులో ప్లాస్మోడియం వైవాక్స్ అనే జ్వరం 14 రోజులపాటు ఉంటుంది. మిగతా రకం జ్వరం మూడురోజుల్లో తగ్గిపోతుంది.
- **టైఫాయిడ్..** ఈ జ్వరం నీరు, కలుషిత ఆహారంవల్ల వస్తుంది. తీవ్ర జ్వరం, కడుపునొప్పి అజీర్తి లక్షణాలు కనిపిస్తాయి. వాతావరణంలో మార్పులు వల్లనే ఈ జ్వరం వ్యాప్తి చెందుతుంది.

సొంత జిల్లాకు తహసీల్దార్లు

- ఉత్తర్వులు వెలువరించిన ప్రభుత్వం

కలెక్టరేట్(కాకినాడ), జూలై 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతరజిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లను సొంత జిల్లాకు బదిలీ చేయాలని ఏపీ భూపరిపాలన ప్రధాన కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులను వెలువరించారు. సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడంలో వీరు అత్యంత కీలకంగా వ్యవహరించారు. ఎన్నికలు సజావుగా పూర్తి అవ్వడంతో వీరిని సొంత జిల్లాకు పంపిస్తున్నారు. వీరికి స్థానిక రెవెన్యూ డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వవద్దని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం - 7లో

22న కాకినాడలో జాబ్‌మేళా - 7లో

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ విక్రాంత్ పాటిల్.. పెద్దాపురం పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పెద్దాపురం, జూలై 19: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. పెద్దాపురం పోలీస్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌ను ఇలాగేనా నిర్వహించేది, కొంచెం కూడా బాధ్యత లేదా అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. ప్రజలకు పోలీస్ సేవలు ఏవిధంగా అందుతున్నాయి, కేసులకు సంబంధించి విచారణ ఏవిధంగా జరుగుతోంది అనే విషయాలపై చర్చించారు. ఇకపై తరచూ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తామన్నారు. రోడ్డుప్రమాదాలు, గంజాయి నియంత్రణ, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, ర్యాష్ డ్రైవింగ్ తదితర అంశాలపై ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం కార్యాలయ రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.లతాకుమారి, సీఐ రవి కుమార్, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

కందిపప్పు ప్రత్యేక కౌంటర్లకు స్పందన కరవు

- వారంరోజుల్లో కేవలం 31 క్వింటాళ్లే విక్రయాలు
- తగినంత ప్రచారంలేక మందగించిన అమ్మకాలు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 19: పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం అందించే ప్రత్యేక కౌంటర్లకు స్పందన తక్కువగా ఉంది. కొనుగోలుదారులు లేక కౌంటర్లు వెలవెలబోతున్నాయి. కౌంటర్లు ఏర్పాటు చేసినా తగినంత ప్రచారం లేక అమ్మకాలు మందగించాయి. జిల్లాలో ప్రజలకు తక్కువ ధరలకే కందిపప్పు, బియ్యం అందించాలని లక్ష్యంతో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న జిల్లావ్యాప్తంగా 26 బియ్యం విక్రయించే కౌంటర్లను, 32 కందిపప్పు ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించింది. జిల్లాలో వివిధ రైతుబజార్లు, హోల్‌సేల్ వ్యాపారులు, సూపర్‌మార్కెట్‌లో వీటిని అందుబాటులో ఉంచింది. కందిపప్పు కిలో రూ.160కి, బియ్యం కిలో రూ.48 నుంచి రూ.49కి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.220 నుంచి రూ.180 వరకు ధరలు ఉన్నాయి. బియ్యం కూడా కిలో రూ.55నుంచి రూ.70 వరకు స్టీమ్, రా రైస్ ధరలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారుల సౌకర్యార్థం తక్కువ ధరలకే వీటిని అందుబాటులోకి తెచ్చింది. తగినంత ప్రచారం లేకపోవడంతో ప్రత్యేక కౌంటర్లు వెలవెలబోతున్నాయి. కొన్ని కౌంటర్లను మారుమూల ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం వల్ల వినియోగదారులను ఆకట్టులేకపోతున్నాయి.

గత వారంలో కేవలం 31 క్వింటాళ్ల కందిపప్పు విక్రయం

గత వారంరోజుల్లో జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రత్యేక కౌంటర్లలో కేవలం 31 క్వింటాళ్ల కందిపప్పు మాత్రమే విక్రయించారు. బియ్యం కేవలం 117 క్వింటాళ్లను మాత్రమే విక్రయించారు. జిల్లాలో 21 మండలాలు ఉండగా రోజుకి కేవలం 3 నుంచి 5 క్వింటాళ్ల కందిపప్పు మాత్రమే విక్రయిస్తున్నారు.

ప్రచారం విస్తృతంగా చేయాలి

పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఆరంభించిన కందిపప్పు ప్రత్యేక కౌంటర్లపై అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది. ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారో చిరునామాలను ప్రదర్శించడం ద్వారా విక్రయాలు పెరిగే అవకాశం ఉందని వినియోగదారులు అంటున్నారు.

పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 19: జిల్లాలో నిత్యావసర వస్తువుల సమస్యలపై జిల్లాస్థాయిలో జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 88869 03611 ఏర్పాటు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎండీయు వాహనాలు, చౌకధరల దుకాణాల ద్వారా అందిస్తున్న నిత్యావసర వస్తువులు వర్షాలవల్ల ఇబ్బంది కలిగితే జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలియచేయవచ్చునన్నారు. వెంటనే సమస్యను పరిష్కరిస్తామన్నారు.



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్లనుంచి దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు



సీతానగరం మండలంలో నీటమునిగిన వరి పొలాలు



అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో పొంగిపొర్లుతున్న సోకిలేరువాగు జలపాతం

ఉధృతంగా గోదావరి

- కాటన్ బ్యారేజ్ 175గేట్లు 1మీటరు మేర ఎత్తివేత
- 3.46 లక్ష క్యూసెక్కులు సముద్రంలోకి
- పొంగుతున్న వాగులు, వంకలు
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి వరద



కూనవరం మండలం వద్ద శబరి సీలేరు, గోదావరి నదుల సంగమ ఉధృతి

ధవళేశ్వరం, జూలై 19: గోదావరి పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా వరద ప్రవాహం గోదావరిలో కలుస్తుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో కాటన్ బ్యారేజ్ వద్ద శుక్రవారం ఉదయం 175 గేట్లను 70మిల్లీమీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు సాయంత్రానికి ఒక మీటరు పైకి ఎత్తి 3,46,391క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 7అడుగులుగా నమోదైంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు గోదావరికి చేరుతుండడంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం మరింత పెరిగి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో ప్రవహించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద 26అడుగుల వరకు వేగంగా పెరిగిన నీటి మట్టం ఆపై నెమ్మదించి శుక్రవారం సాయంత్రానికి 26.80అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం పెరుగుదల నెమ్మదించినా ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో 40 అడుగులకు పైగా నీటి మట్టం పెరగవచ్చని అధికారుల అంచనా.

ఏజెన్సీలో ఎడతెరిపి లేని వాన

- పరిస్థితిని సమీక్షిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి

చింతూరు, జులై 19: అల్లూరి జిల్లా చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో శుక్రవారం రోజంతా ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలో శుక్రవారం రోజంతా వర్షం కురిసింది. దీంతో శబరి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు రాకపోకలకు ఎటువంటి అంతరాయాలు చోటుచేసుకోలేదు. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి 26.5 అడుగులకు చేరుకుంది. శనివారం నాటికి 30 అడుగుల నీటి మట్టానికి చేరుకోవచ్చన్న అంచనా ఉంది. ఎగువ రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా సరిహద్దులలో కూడా వర్షం కురుస్తుండడంతో ఆ నీరంతా శబరిలోకి చేరి ఉధృతికి కారణంగా మారింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. చింతూరు, వరరామచంద్రపురం మండలాల నడుమ ప్రధాన రహదారిపై జల్లివారిగూడెంవాగు పొంగి ప్రవహిస్తుండడంతో దాదాపు నాలుగు గంటలపాటు ఆ దిశగా రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రానికి వర్షం కాసింత తగ్గుముఖం పట్టడడంతో ఆటుగా రాకపోకలు పునరావృతమయ్యాయి. చింతూరు ఐటీడీఏ పీవో ఎప్పటికప్పుడు వరద ఉధృతిపై సమీక్ష చేస్తున్నారు. పొంగి ప్రవహిస్తున్న వాగుల వద్దకు ఆయన తన బృందంతో నేరుగా పరిశీలిస్తున్నారు. ఆ మేరకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇప్పటికి వరద సహాయ చర్యల్లో భాగంగా బఫర్ స్టాక్ సిద్ధం చేశారు.



చింతూరు-వరరామచంద్రపురం మండలాల నడుమ ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరుగూడెం వాగు

కోటిపల్లి ఫెర్రీ రేవులో రాకపోకలు బంద్

కె.గంగవరం, జూలై19: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి-ముక్తేశ్వరం ఫెర్రీ రేవులో రాకపోకలు శుక్రవారం ఉదయం నుంచి నిలిపివేశారు. బంగాళాఖాతం అల్పపీడనం కారణంగాను, ఎగువ ప్రాంతా ల నుంచి గోదావరికి వస్తున్న వరదనీటి కారణంగా గోదా వరిలో ప్రవాహం ఉధృతంగా ఉంది. ఫెర్రీ రేవులో తాత్కాలిక రహదారి మునిగిపోవడంతో రాకపోకలు నిలిపి వేశారు. వరద ఉధృతి తగ్గిన తరువాత రాకపోకలు పునరుద్ధరిస్తామని ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ చెప్పారు.



కోటిపల్లి ఫెర్రీలో నిలిచిపోయిన పంట్లు



అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలంలో నీటమునిగిన వరి పొలాలు



వరదనీటిలో ఉన్న పోశమ్మగండి అమ్మవారి ఆలయం

జలదిగ్బంధంలో గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం, జూలై 19: ఇటీవల కురిసిన వర్షాలకు గత వారంరోజుల నుంచి గోదావరి వరద నెమ్మనెమ్మదిగా పెరగడంతో మండలంలో ముంపు గ్రామాలతోపాటు మాతృశ్రీ గండి అమ్మవారి ఆలయాన్ని శుక్రవారం చుట్టుముట్టింది. దీంతో అమ్మవారి విగ్రహం మెడ భాగం వరకు వరదనీరు చేరింది. ఇదే వరద కొనసాగినట్లయితే శనివారం సాయంత్రానికి వరదనీరు అమ్మవారి గోపురాన్ని తాకే అవకాశముంది. ఎడతెరిపి లేకుం డా వర్షం కురవడంతో మండలంలో పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. మరోపక్క వర్షంధాటికి నారుమడులు, పలు కూరగాయల పంటలు నీట మునిగాయి.

కోటసత్తెమ్మ ఆలయానికి తాకిన వరదనీరు



తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయంలోకి ప్రవేశించిన వరదనీరు

నిడదవోలు, జూలై 19 : నిడదవోలు మండలం తిమ్మ రాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలోకి వరదనీరు ప్రవేశించింది. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్రకాలువ వరదనీరు దిగువకు విడుదల చేయడంతో అమ్మవారి దేవస్థానం వెనుకఉన్న కల్వర్టు ద్వారా అమ్మ వారి గర్భాలయంలోకి ప్రవేశించింది. అలాగే ఆలయ ఆవ రణలోని ధ్వజస్తంభం ప్రాంతంలో కూడా వరదనీరు ప్రవే శించింది. ఆలయ అధికార్లు ఆలయం లోపల నీటిని మో టార్ల ద్వారా బయటకు తోడించేలా చర్యలు చేపట్టారు. ఎర్రకాలువ ఎప్పుడు పొంగి ప్రవహించినా అమ్మవారి ఆలయంలోకి ప్రవేశిస్తోందని, సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ, జూలై 19: ఈనెల 20వతేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం జరుగుతుందని జడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. జడ్పీ ఛైర్మన్‌తోపాటు ఆయా స్థాయి సంఘాల ఛైర్మన్ల అధ్యక్షతన స్థాయీసంఘాల సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ఆయా స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సీఈవో తెలిపారు.

22న కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడసిటీ, జూలై 19: ఈనెల 22న కాకినాడలోని వికాస కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో వివిధ కంపెనీలు, సంస్థల్లో లోన్ ఆఫీసర్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్, ట్రైనీ అకౌంటెంట్, అకౌంటెంట్, సర్వీస్ అడ్వయిజర్, హెల్పర్స్, టెక్నీషియన్, టెలికాలర్, సేల్స్ రిప్రజెంటేటివ్, అసిస్టెంట్ మేనేజర్, సూపర్‌వైజర్, కెమిస్ట్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.30వేలవరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం వసతి, రవాణా ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరుకావాలన్నారు. సెల్:7799376111లో సంప్రదించాలన్నారు.

నేడు రామచంద్రపురంలో మెగాజాబ్ మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 19: రామచంద్రపురం వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మెగాజాబ్‌మేళా నిర్వహించనున్నారు. జాబ్‌మేళాలో సాఫ్ట్‌వేర్, ఫార్మా, బ్యాంకింగ్, బి.పి.వో, టెక్నికల్ రంగానికి సంబంధించి 36 ప్రముఖ కంపెనీల్లో సుమారు 2366 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టరు కె. లచ్చారావు తెలిపారు. ఎన్‌క్లవ్డ్ సర్వీసెస్, జెన్‌ప్యాక్ట్, టెక్‌మహీంద్రా, ఎంఎస్‌సీ ఐటీ, ఓషన్‌యాప్స్‌టెక్నాలజీస్, బి.ఎస్.సి.పి.ఎల్, నిట్, ఐసిఐసిఐ బ్యాంకు, కోజెంట్ ఇ సర్వీసెస్, ఇండిగో ఎయిర్ లైన్స్, హ్యుండాయ్ మెబీస్, డెక్కన్ కెమికల్స్ తదితర సంస్థల్లో వివిధ ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తామన్నారు. ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు వయస్సుగల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఉద్యోగాలను బట్టి రూ 13 వేల నుంచి 60 వేలు వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఉదయం 9 గంటలకు అర్హత సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావాలని కోరారు.

జేఎన్టీయూకే అభివృద్ధికి కృషిచేస్తా

- ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జూలై 19: కాకినాడ జేఎన్టీయూకే అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించడంతోపాటు కాలానుగుణంగా ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న మార్పులను అనుసరించి బోధన ఉండేలా ప్రణాళిక చేపడతామన్నారు. వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా తనకు అవ కాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్, ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి సౌరబ్‌గౌర్, ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ రామ్మోహన్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణకు మాజీ ఉపకులపతులు, వర్సిటీ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాదరాజు, శ్రీనివాసకుమార్, పద్మరాజు, రిజిస్ట్రార్ సుమలత, మాజీ రిజిస్ట్రార్‌లతో ఇన్‌ఛార్జి వీసీ సమావేశం నిర్వహించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మురళీకృష్ణను అభినందిస్తున్న ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్, మాజీ వీసీలు

గోకవరం పోలీసులు నన్ను హింసించారు

- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆరోపణ
- ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు వెల్లడి



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 : గోకవరం ఎస్ఐ తనపై దౌర్జన్యం చేసి దుర్భాషలాడారని గోకవరం మండలం మల్లవరం గ్రామానికి చెందిన ఇంటి సూర్యచంద్ర అనే వ్యక్తి ఆరోపించారు. ఈ మేరకు రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సూర్యచంద్ర శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన మల్లవరంలో తన పక్కింటివారితో తలెత్తిన వివాదంపై గోకవరం పోలీసులను ఆశ్రయిస్తే బాధితుడినైన తనపైనే దౌర్జన్యం చేశారని తెలిపాడు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ, డీఎస్పీలకు ఫిర్యాదు చేయడం జరిగిందని, తనకు న్యాయం చేయాలని కోరారు.

అగ్నివీర్‌లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

రంపచోడవరం, జూలై 19: అగ్నివీర్ పథకంలో భాగంగా భారత వాయుసేనలో ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైందని గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు జూలై-2004 నుంచి జనవరి -2008 మధ్య జన్మించి ఉండాలని, ఇంటర్ ఒకేషనల్, పాలిటెక్నిక్‌లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. ఈనెల 28 తేదీ లోగా http://agnipathvayu.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాల

మత్స్యకారులకు చిక్కిన పండుగొప్పలు

అంతర్వేది, జూలై 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెంలో మినీ ఫిషింగ్ హార్బర్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల వలలకు శుక్రవారం అధిక సంఖ్యలో పండుగొప్ప చేపలు దొరికాయి. సాగరసంగమం తీరాన మత్స్యకారులు వేటాడారు. ఎర్ర నీరుకు ఎదురీదుతున్న పండుగొప్ప చేపలు మత్స్యకారుల వలలకు చిక్కాయి. పల్లెపాలెంలో మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు వాటిని విక్రయించారు. కొనుగోలుదారులు పాట పాడుకున్నారని, రూ.లక్షల్లో ఆదాయం వచ్చిందని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. కిలో రూ.500 చొప్పున విక్రయించినట్టు చెప్పారు. సుమారు రూ.2.50లక్షలు వచ్చినట్టు వారు తెలిపారు.



అంతర్వేది పల్లిపాలెంలో మత్స్యకారులకు దొరికిన పండుగొప్పలు

వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి

మామిడికుదురు, జూలై 19: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం కరవాక గ్రామంలోని గంగాపురం కాలనీకి చెందిన మత్స్యకారుడు కొప్పనాతి రాంబాబు (38) వేటకు వెళ్లి శుక్రవారం మృతి చెందాడు. చేపలు పట్టేందుకు విసిరిన వల గాలికి తిరిగి మీద పడడంతో వలలోచిక్కుకుని ఉప్పుటేరులో పడి మునిగి మృతి చెందినట్టు నగరం ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



మృతిచెందిన మత్స్యకారుడు రాంబాబు

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

గొల్లప్రోలు, జూలై 19: కాకినాడజిల్లా గొల్లప్రోలులో వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మరణించాడు. పట్టణంలోని కొత్తపేటకు చెందిన కర్రి వెంకటేశ్వరరావు(70) 18వ తేదీ మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. బయట పని ఉందని చెప్పి సాయంత్రం 6గంటలకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎక్కడ వెతికినా కనిపించలేదు. శనివారం ఉదయం వార్డు సచివాలయం-5 వద్ద గల డ్రెయిన్‌లో పడి వెంకటేశ్వరరావు చనిపోయి ఉండగా స్థానికులు గుర్తించారు. దీనిపై అతని భార్య కర్రి నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త మృతికి గల కారణాలు తెలుసుకోవాలని కోరారు. దీనిపై బీఎన్ఎస్ఎస్ యాక్ట్ 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జానీభాషా తెలిపారు.

ఒడిసా మహిళ హత్య కేసులో భర్తే నిందితుడు

సర్పవరం జంక్షన్, జూలై 19: ఒడిస్సా వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్న భర్తే హత్య చేసినట్లు నిర్ధారించి నిందితుడ్ని అరెస్టుచేసి కోర్టుకు తరలించారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు ఒడిస్సా గంజాం జిల్లా కూలంగి గ్రామానికి చెందిన రితంజలి స్వైయిన్ (30) భర్త మీలు స్వైయిన్‌లు కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరం శివారు భావనారాయణపురంలో నివాసం ఉంటున్నారు. ఈనెల 16వ తేదీన భార్య రితంజలి స్వైయిన్‌ని హత్యచేసి కుమారుడుతో పరారయ్యాడు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. నిందితుడు మీలు స్వైయిన్ సర్పవరం ఆటోనగర్‌లో సంచరిస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. మద్యానికి వ్యసన పరుడై, శారీక కోర్కె తీర్చాలని భార్యను కోరగా తిరస్కరించడంతో కోపంతో భార్యను కొట్టి కిందపడేసి, నేలకు బుర్రను గుద్ది హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడని అన్నారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

అత్యాచార నిందితుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

ఎటపాక, జూలై19: నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన అమరవరపు రాము అనే నిందితుడిని శుక్రవారం ఏఎస్పీ రాహుల్ మీనా అరెస్ట్ చేశారు. మండలంలోని ఓ గ్రామంలో నిందితుడిని అరెస్టుచేసి రంపచోడవరం కోర్టుకు రిమాండ్‌కు పంపారు. మండలంలోని ఓ గ్రామంలో ఈనెల 10న నాలుగేళ్ల చిన్నారిపై నిందితుడు అఘాయిత్యానికి పాల్పడిన విషయం విదితమే.

వ్యక్తిపై డ్రింక్ బాటిల్‌తో దాడి

- నిందితుడి అరెస్టు.. రిమాండ్

కడియం, జూలై 19: కడియం మండలం మాధవరాయుడుపాలెం శివారు చైతన్య నగర్ దుర్గ ఆలయం సెంటర్ వద్ద ఈనెల 18న ముంజేటి సురేష్ అలియాస్ కాళీ, అనే వ్యక్తి మద్యం తాగి ఆ బాటిల్‌ను సెంటర్‌లో రోడ్డుపై పగులగొట్టాడు. పలువురు నడిచే దారిలో పగుల గొట్టడం ఏమిటని సురేష్‌ను పలువురు వారించగా వారిని ధిక్కరిస్తూ మాట్లాడుతున్న సమయంలో వార్డుమెంబర్ బళ్ల ధనుంజయరాజు కూడా వారించే ప్రయత్నం చేశాడు. దీంతో అతనిపై సురేష్ తిరగబడి పక్కనే ఉన్న బడ్డీకొట్టులో డ్రింక్ బాటిల్‌ను పగులగొట్టి తిరగబడ్డాడు. దీంతో ధనుంజయ వీపు వెనుక, మోకాలుపై గాయాలు కాగా, కడియం సీహెచ్‌సీకి తరలించారు. బాధితుడు స్టేట్‌మెంట్ ప్రకారం సౌత్‌జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ ఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఎస్ఐ కృష్ణసాయి కేసు నమోదుచేసి సురేష్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు. కాగా సురేష్‌పై 2022లో బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసు, 2021లో రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో కొట్లాట కేసు, కడియం పోలీస్‌స్టేషన్‌లో 2022లో, 2023లో కొట్లాట కేసులు ఉన్నట్టు డీఎస్పీ తెలిపారు.

గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి

- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట, జూలై 19: ప్రణాళికాబద్ధంగా గ్రామాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో జిల్లాస్థాయి మాస్టర్ లెవెల్ (డీఎల్ఎంటీ) శిక్షణార్థులకు మూడు రోజుల శిక్షణా తరగతులలో భాగంగా రెండోరోజైన శుక్రవారం ప్రిన్సి పాల్ వేణుగోపాల్ హాజరయ్యారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామాలలో పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో పంచాయతీలు సంపద సృష్టించే కేంద్రాలుగా రూపుదిద్దుకోవాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ శిక్షణలు పొందిన డీఎల్ఎంటీలు జిల్లా స్థాయిలో గ్రామాల నుంచి ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణా తరగతులు తొమ్మిది రోజులపాటు జరుగనుండగా శ్రీకాకుళం నుంచి ఏలూరు జిల్లాల వరకూ 11 జిల్లాల నుంచి మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో చైల్డ్ ఫ్రెండ్లీ విలేజి, వాటర్ సఫిసీమెంట్ విలేజ్‌లుగా మూడు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణా తరగతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులకు ఈ శిక్షణా తరగతులకు హాజరుకాగా వివిధ అంశాలపై ఫ్యాకల్టీలు జీవీ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్‌లు వివరించారు. రెండో రోజు శిక్షణా తరగతులకు వివిధ జిల్లాలకు చెంది ఎడ్యుకేషన్, సోషల్ వెల్ఫేర్, హౌసింగ్, డ్వామా, వ్యవసాయ, పంచాయతీ రాజ్‌శాఖలకు చెందిన అధికారులను డీఎల్ఎం టీలుగా ఎంపికైన శిక్షణా తరగతులకు 70 మంది హాజరయ్యారు

నర్సింగ్‌పేటలో గిరిజనుడి అదృశ్యం

- పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

ఎటపాక, జూలై19 : ఎటపాక మండలం రాంగోపాలపురం పంచాయతీ పరిధిలో నర్సింగ్‌పేట గ్రామానికి చెందిన కొర్సా కామేశ్వరరావు అదృశ్యమైనట్లు శుక్రవారం ఎటపాక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనెల17న కామేశ్వరావువేటకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడని, మూడు రోజులు గడుస్తున్నా ఇంటికి రాలేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి రీడిప్లాయిమెంట్ ఇవ్వాలి

- నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 : నేషనల్ హెల్త్ మిషన్‌లో ఎన్‌సీడీ, సిమాంక్, ఎన్‌బీఎస్‌యూ, హెచ్‌డీఐసీయూ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వారు పనిచేసే ఆసుపత్రుల్లో ఉన్న ఖాళీల్లో, ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో ఉన్న ఖాళీల్లో వెంటనే రీడిప్లాయిమెంట్ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, మిషన్ డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను జిల్లాల అధికారులు అమలు చేయకుండా ఇబ్బందిపెడుతున్నారన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

వీవీమెరకలో గోధుమ తాచు హల్‌చల్

అంతర్వేది, జూలై 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం వీవీమెరక గ్రామం పెన్నుల కంపెనీ రోడ్డులో శుక్రవారం గోధుమ తాచుపాము హల్‌చల్ చేసింది. ఉదయం కదలకుండా ఒకేచోట ఉండడంతో జనం గోధుమతాచును చూసేందుకు ఎగబడ్డారు. ఇంత పెద్ద పామును చూసి తొలుత గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఆరు అడుగులు పొడవు ఉన్న ఈ గోధుమ తాచుకు పలువురు పూజలు చేయడం విశేషం. ఈ తాచుపామును స్నేక్ క్యాచర్ వర్మ చాకచక్యంగా పట్టుకున్నారు.



వేటకు వెళ్లని మత్స్యకారులు

కొత్తపల్లి, జూలై 19: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉప్పాడ తీరప్రాంతానికి చెందిన మత్స్యకారులు శుక్రవారం వేటను స్వచ్ఛందంగా విరమించారు. సముద్రం ప్రశాంతంగా ఉన్నప్పటికీ గాలులు వీచడంతో వేటను విరమించినట్టు మత్స్యకారులు తెలిపారు. అల్పపీడన ప్రభావంతో తీరప్రాంతంలో శుక్రవారం ఉదయం నుంచీ సాయంత్రం వరకు చిరుజల్లులు కురిసి ఉపాధి కూలీల ఉపాధికి ఆటంకం ఏర్పడింది.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి : వర్మ

పిఠాపురం, జూలై 19: తుఫాన్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీవర్షాలు కురవడంతో పాటు పిడుగులు పడే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు, పొలాల్లో పనిచేసే రైతులు చెట్లు కింద ఉండకూడదన్నారు. సముద్రంలో ఈదురుగాలుల ఉధృతి అధికంగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, అధికారుల సూచనలు పాటించాలని కోరారు. తీరప్రాంత గ్రామాల్లో తక్షణం షెల్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. వర్షాలు అధికంగా పడితే పంటపొలాల్లో నీరు నిలిచే అవకాశం ఉందని, వ్యవసాయాధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సీకోటి నానాజీ, బొండు జగన్నాథం, బుజ్జి, కనకరాజు పాల్గొన్నారు.

'ప్రాచీన ఆలయాల విశిష్టత భావితరాలకందిస్తాం'

సర్పవరం జంక్షన్, జూలై 19: ప్రాచీన, హిందూ దేవాలయాల విశిష్టత, హిందూ ధర్మపరిరక్షణ భావితరాలకు చాటిచెప్పేందుకు పుణ్యక్షేత్రాలు సందర్శిస్తున్నట్టు బృహత్ అన్వేషి ధార్మిక సంస్థ ఫౌండర్ పంకజ్ సక్సేనా తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బృహత్ అన్వేషి సంస్థ ఆధ్వర్యంలో 35 మంది భక్త బృందం ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ రూరల్ సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర భారతదేశ యాత్రలో భాగంగా కర్నాటక, ఒడిసా, గోవా, గ్వాలియర్, చంబాలలో ఉన్న ప్రముఖ దేవాలయాలను సందర్శించామన్నారు. ద్రాక్షారామ, కోనసీమ ప్రాంతాలతో పాటూ శ్రీకాకుళంలో ఉన్న పలు పుణ్యక్షేత్రాలు దర్శించడం జరుగుతుందన్నారు. పుణ్యక్షేత్రాలు, వీటి విశిష్టతను పుస్తక రూపంలో తయారు చేసి భక్తులకు ఆధ్యాత్మిక విజ్ఞానం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి విచ్చేసిన భక్త బృందానికి ఆలయ ఈవో జొన్నాడ భీమశంకర్ స్వాగతం పలికారు. గుమస్తా కుమార్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

'సముద్రకోతపై సమగ్ర సమాచారం సేకరించాలి'

కొత్తపల్లి, జూలై 19: ఉప్పాడ సముద్రకోతపై పూర్తిస్థాయి సమాచారం సేకరించాలని జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో పి.వెంకటనారాయణ అధ్యక్షతన గురువారం సముద్రకోతపై సమగ్ర సమాచార సేకరణ కోసం నిర్వహించిన మండల, గ్రామస్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప్పాడ తీరప్రాంతంలో జనాభా, ఎంతమంది సముద్రంపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు, సముద్రకోత కారణంగా గ్రామం ఎంతమేర కోతకు గురైంది, సముద్రకోత ఏఏ సమయాల్లో అధికంగా ఉంటుంది, ఇప్పటి వరకు ఎంతమంది మత్స్యకారుల గృహాలు సముద్రంలో కలిసిపోయాయనే సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. తహశీల్దార్ రాజు, ఈవోపీఆర్డీ ఎంఎస్.భాస్కర్, ఏఎస్‌వో అప్పలరాజు పాల్గొన్నారు.

'విద్యార్థులు మధ్యాహ్న భోజనం స్వీకరించాలి'

సామర్లకోట, జూలై 19: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులందరికీ పౌష్టికాహారం అందజేసేందుకు, డ్రాపవుట్స్‌ను నిరోధించేందుకు విద్యార్థులందరూ మధ్యాహ్న భోజన పథకాన్ని స్వీకరించే బాధ్యతను ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలని సామర్లకోట ఎంఈవో పి.వుల్లయ్య పేర్కొన్నారు. సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనథకం అమలుతీరును ఎంఈవో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. పాఠశాలలో వివిధ నిర్మాణపనులను పరిశీలించి త్వరితగతిన నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. హెచ్ఎం మీనామాధురి, హనుమంతరావు, ప్రకాష్, సీఆర్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సామర్లకోట మండలంలోని మాధవ పట్నం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో వై.శివరామకృష్ణయ్య సందర్శించారు.

'ముందు చూపుతో ఇళ్లు నిర్మించుకోవాలి'

కాకినాడ సిటీ, జులై 19: గృహనిర్మాణ లబ్ధిదారులు ముందు చూపుతో ఆలోచించి ప్రతిఒక్కరూ ఇళ్లు నిర్మించుకోవాలని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ కోరారు. కొమరగిరి లే అవుట్ 36, 37 డివిజన్ల గృహనిర్మాణ లబ్ధిదారుల అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ కొంత మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చినా స్థలాలు ఎక్కడ ఉన్నాయో ఇప్పటివరకు తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సత్యనారాయణరెడ్డి, ఏఈ విగ్నేష్, 36వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, జనసేన ఇన్‌చార్జి సుంకర సురేష్, 37వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి మల్లాడి గంగాధర్, మహిళా నాయకురాలు నల్లూరి తులసి, నాయకులు ఆకెళ్ల ప్రసాద్, రాజేష్, వీరభద్రరావు, వాసు పాల్గొన్నారు.

'జనవిజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరండి'

గొల్లప్రోలు, జూలై 19: శాస్త్రీయ సమాజం నిర్మాణం కోసం జనవిజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని జేవీవీ ప్రతినిధులు కోరారు. గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జనవిజ్ఞానవేదికలో సభ్యులుగా చేరాలంటూ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.మురళీధర్, గౌరవాధ్యక్షుడు దాడి పద్మనాభం, సమతా జిల్లా కన్వీనర్ చల్లా ఉమారాజమంగతాయారు, మండలశాఖ అధ్యక్షుడు ఏలేటి నానిబాబు, హెచ్ఎం సూర్యప్రకాశరెడ్డి పాల్గొన్నారు.

'ఉచితంగా విత్తనాలను సరఫరా చేయాలి'

తాళ్లరేవు, జూలై 19: అల్పపీడనం కారణంగా 4 రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రైతులు వరినాట్లు నీటిమునిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శుక్రవారం విజయవాడలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెనాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్టు రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి ధూళిపూడి వెంకటరణ తెలిపారు. ప్రభుత్వం రైతులకు ఉచితంగా విత్తనాలను సరఫరా చేయాలని కోరామన్నారు.

గ్రోయిన్స్ మరమ్మతులకు నిధుల మంజూరు

కోటనందూరు, జూలై 19: తాండవ రిజర్వాయర్ కింద గ్రోయిన్స్ మరమ్మతులకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలను టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన దీంతో జిల్లా కలెక్టర్‌కు వివరించారు. వెంటనే ఖరీఫ్ సీజన్‌కు ఆటంకం లేకుండా నీరందించే లక్ష్యంతో కామినీడు గ్రోయిన్‌కు రూ.2.60లక్షలు, దిగువాల గ్రోయిన్‌కు రూ.1.70లక్షలు, కోటనందూరు గ్రోయిన్‌కు రూ.2.0లక్షలు మంజూరు చేశారు. వెంటనే పనులు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

800వ రోజుకు లోకేశ్ ఫౌండేషన్ భోజన వసతి

కాకినాడ సిటీ, జూలై 19: నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజీ ద్వారా కాకినాడలో నిర్వహిస్తున్న పేదలకు ఉచిత భోజన వసతి 800వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా శుక్రవారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ ఉచిత భోజన వసతి 800వరోజు పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ఆధ్వర్యం వహించారు. అనంతరం సభ్యులకు పార్టీ సభ్యత్వం కార్డులు అందజేశారు.

పేదలు, దివ్యాంగులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ

గొల్లప్రోలు, జూలై 19: ఆపద సమయాల్లో పేదలకు అండగా ఉంటామని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు తెలిపారు. వర్షాల కారణంగా పనులు, ఉపాధి లేక ఇబ్బందులకు గురవుతున్న అనాథలు, వృద్ధులు, పేదలు, దివ్యాంగులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏఐఎఫ్‌టీయూ నాయకులు డి.నారాయణమూర్తి, గుడాల చార్లెస్, కేశవరపు వీరన్న, గొర్ల శివ, అక్కిరెడ్డి సురేష్, కాదా బాబ్జి తదితరులున్నారు.


నేడు కరప మండల సర్వసభ్య సమావేశం

కరప, జూలై 19: మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లుచేశారు. ఈ సమావేశానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ విచ్చేస్తున్నారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత తొలిసారిగా ఆయన మండలానికి విచ్చేస్తుండడంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఆయా శాఖల ప్రగతి నివేదికలతో అధికారులు సర్వసభ్య సమావేశానికి సన్నద్ధమవుతున్నారు. సమావేశానికి సభ్యులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

శంఖవరం, జూలై 19: శంఖవరంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం జనసేన నేతలు ప్రారంభించారు. మొదటి సభ్యత్వాన్ని కర్రిజార్జి, వేల్పుల నాగవిష్ణుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ జనసేన యూత్ అధ్యక్షుడు మామిడి వెంకటేష్, ఉపాధ్యక్షులు సలాది విష్ణు, కర్రి వినోద్ కుమార్, కర్రి రమేష్, పాలపర్తి దొరబాబు, కుర్రే సురేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ



ప్రత్తిపాడు, జూలై 19: ప్రత్తిపాడు నరేంద్రగిరి కొండ జాతీయ రహదారిపై శుక్రవారం ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న దుర్ఘటనలో డ్రైవర్, క్లీనర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. కత్తిపూడి నుంచి యర్రవరం వైపు వెళ్తున్న బియ్యంలో లోడు లారీ స్థానిక నరేంద్రగిరి కొండ జంక్షన్ వద్ద నిలిపివేయడంతో వెనుక నుంచి వస్తున్న మరో లోడు లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో లారీలో డ్రైవర్,క్లీనర్‌లు తీవ్రంగా గాయపడగా ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఢీకొన్న లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయింది.

రోజంతా ముసురు వాతావరణం

» ఎడతెరిపి లేని వర్షాలు
» పొంగిపొర్లిన డ్రెయిన్లు
» జలమయమైన రహదారులు
» ఇబ్బందులు పడుతున్న ప్రజలు
» వరినారుమడుల్లోకి చేరిన వర్షపు నీరు



గొల్లప్రోలులో డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్డు మీదకు చేరిన మురుగునీరు



ఏలేశ్వరం పట్టణం లింగవరం కాలనీలో నీట మునిగిన ప్రభుత్వ పాఠశాల



ప్రత్తిపాడు మండలం లంపకలోవలో నీట మునిగిన వరి నారుమళ్లు

పిఠాపురం, జూలై 19: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రోజంతా ముసురు వాతావరణం నెలకొంది. శుక్రవారం తెల్లవారుజామున ప్రారంభమైన వర్షం రాత్రి వరకూ కొనసాగింది. ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉండడంతో పిఠాపురం పట్టణంలో పలుచోట్ల డ్రెయిన్లు పొంగిపొర్లాయి. రహదారులపై ఎక్కడిక్కడ వర్షపునీరు నిలిచిపోయింది. వర్షంలోనే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లగా, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు రాకపోకలు సాగించారు. వర్షపు నీరు వరినారుమడుల్లోకి చేరింది. వెదజల్లు పద్ధతి వరి సాగు చేసి విత్తనాలు వేసిన పొలాల్లో నీరు నిలిచిపోయింది. పిఠాపురం, మండలంలోని పలు గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లో నారు నీట మునిగినట్లు అంచనా వేస్తున్నారు. వర్షం ఒకటి, రెండు రోజులు కొనసాగితే వరి నారుమడులు, వేసిన వరి విత్తనాలు దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తున్నారు. సార్వా నారుమడి దశలో ఉన్న పంట, విత్తనం చల్లి 2-3రోజుల వయస్సులో ఉన్నప్పుడు 3 రోజులు కంటే ఎక్కువగా ముంపు ఉంటే మొలకశాతం గణనీయంగా పడిపోతుందని వ్యవసాయశాఖ ఏడీ స్వాతి, ఏవో అచ్యుతరావు తెలిపారు. వీలైనంత త్వరగా నీరును తొలగిస్తే విత్తనం త్వరంగా గాలి పోసుకుంటుందని, దీని వల్ల నష్టం జరగదని చెప్పారు. నీరు తీసిన తర్వాత నష్ట నివారణకు తగు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రహదారులన్ని జలమయమయ్యాయి. వర్షాలతో మెట్ట పంటలకు మేలు చేకూరింది. వరి నారుమడులు, వెదజల్లు పద్ధతిలో విత్తనాలు వేసిన మడుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. గత వారం రోజుల్లో వరి, పత్తి, ఇతర పంటల విత్తనాలు వేసిన రైతులు వర్షాలు కారణంగా విత్తనాలు దెబ్బతిని మొలకలు సరిగా రావని ఆందోళన చెందుతున్నారు. అయితే మరో 2, 3 రోజులపాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు వారిని కలవరానికి గురిచేస్తున్నాయి. పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే తొలగించుకోవాలని వ్యవసాయాధికారి సత్యనారాయణ సూచించారు.

ప్రత్తిపాడు: మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో పెదశంకర్లపూడి వెంకన్నదొరచెరువు, ఏలూరు వెంకటపతిరాజు చెరువు, ఒమ్మంగి రాజు చెరువు తదితర చెరువుల్లోకి వర్షపునీరు తరలివస్తుంది. ఖరీఫ్ పనులకు ఈ వర్షం ఎంతో మేలు చేకూరుస్తుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లంపకలోవ, ఉత్తరకంచి, పెద్దిపాలెం, ఏలూరు, పొదురుపాక తదితర చోట్ల నారుమళ్ళలోకి వర్షపునీరు రావడంతో అవి స్వల్పంగా మునిగాయి. మండల వ్యాప్తంగా ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంచేసేందుకు రైతన్నలు సన్నద్ధమయ్యారు. భారీవర్షాలతో పొలాలతో దుక్కులు, ట్రాక్టర్లతో దమ్ములు, దున్నే పనులు చేపట్టారు.

తాళ్లరేవు: గత 4 రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలుగ్రామాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ బాగోక వర్షంనీరు వెళ్లే మార్గం లేక గ్రామాలు రహదారులు మునిగిపోయాయి. తాళ్లరేవు మెయిన్‌రోడ్డు గుడ్డువానితూము సెంటరు నుంచి చెరువుగట్టు సెంటరు వరకు చెరువును తలపిస్తుంది. పోలేకుర్రు బీసీ కాలనీ వర్షంనీటికి మునిగిపోయింది. ఇళ్లల్లోకి వర్షంనీరు పోవడంతో పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ ఆధ్వర్యంలో సిబ్బంది వర్షంనీటి దారి మళ్లించారు. ఇళ్లల్లో వర్షంనీటిని బకెట్లతో యజమానులు తోడుకుంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సామర్లకోట: సామర్లకోట పట్టణం, మండలంలో 3 రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు ముంపులోకి చేరాయి. సామర్లకోట పట్టణ పరిధిలో నిర్మించిన జగనన్న కాలనీలో పలు రోడ్లు నీటముంపులో ఉన్నాయి. దీంతో కాలనీలో అంటురోగాలు ప్రబలే ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయి.

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం భారీ వర్షం కురవడంతో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. మెయిన్ రోడ్డు, అంబేడ్కర్ నగర్, ఆర్టీసీ బస్‌స్టాండ్, షిర్డీనగర్ రహదారులు, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, లింగవరం కాలనీ ప్రాథమిక పాఠశాలల ఆవరణలు మునగడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

తొండంగి: శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పాఠశాలల్లో విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో షేక్ బాబ్జి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పక్కా భవనాల్లో మాత్రమే తరగతులు నిర్వహించాలని, అనువైన పరిస్థితులు లేకపోతే అధికారులకు తెలపాలని కోరారు.

గండేపల్లి: భారీ వర్షాలకు లోతట్టు కాలనీలన్నీ నీట మునిగి జలమయమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గండేపల్లి-సింగరంపాలెం, తాళ్ళూరు- ఉప్పలపాడు, గండేపల్లి- యల్లమిల్లి రహదారులన్నీ అధ్వానంగా మారడంతో ద్విచక్రవాహనదారులు గోతుల్లో పడి ప్రజలు గాయాలపాలవుతున్నారు.

కోటనందూరు: మండలంలో శుక్రవారం కుండపోతగా వర్షం కురిసింది. రోడన్నీ జలమయమయ్యాయి. వాగులు, చెరువులు నిండి ప్రవహిస్తున్నాయి.

రౌతులపూడి: భారీ వర్షాల కారణంగా మండల ప్రజలు ఇళ్ల వద్దే పరిమితమయ్యారు. విద్యుత్ సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లోకి నీరు చేరడంతో వరినాట్ల రైతులు దమ్ములు పట్టడానికి సిద్ధమయ్యారు.

కిర్లంపూడి: మండల గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తుంది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జగ్గంపేట: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు పుష్కర, ఏలేరు జలాలు పూర్తిస్థాయిలో మెట్ట రైతాంగానికి చేరవ కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొలకరి పంటలు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

తుని రూరల్: రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం రైతులకు ఊరట నిచ్చింది. తుని నియోజకవర్గంలో 60కి పైబడి సాగునీటి చెరువుల్లో నీళ్లు చేరడంతో వ్యవసాయపనులు ఊపందుకున్నాయి.

నష్టాల నుంచి గట్టెక్కవచ్చు : డీఏవో

సామర్లకోట, జూలై 19: రానున్న 2రోజులలో మరింత అధిక వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున జిల్లాలో వరి నారుమడులు వేసిన రైతులు, నాట్లు దశ పూర్తయిన రైతులు మెళకువలు పాటించడం ద్వారా అధిక వర్షాల నుంచి నష్టాల నుంచి గట్టెక్కవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో అచ్చంపేట, పనసపాడు, వల్లూరు, మామిళ్ళదొడ్డి, ఉండూరు, వీకె.రాయపురం, సామర్లకోట ఏడీబీ రోడ్డు తదితర ప్రాంతాల్లో నీటముంపు వరిపొలాలను సామర్లకోట ఏవో ఐ.సత్య, వ్యవసాయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. డీఏవో మాట్లాడుతూ రైతులందరూ తాము ఊడ్చిన, వెదజల్లిన పొలాల నుంచి నీరు బయటకు వెళ్లే విధంగా కాలువలు శుభ్రపరుచుకోవాలన్నారు. నారుమడులు నీటముంపునకు గురైతే వర్షం నీరు బయటకు తీసివేసి 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేటా ఆఫ్ పొటాష్(ఎంవోపీ) వేసుకోవడం వలన కొత్త ఆకు వచ్చి ఊడ్పులకు అందుతుందన్నారు.

'రైతులు అప్రమత్తంగా ఉండాలి'

ప్రత్తిపాడు, జూలై 19: భారీవర్షాల వల్ల ఖరీఫ్ సాగు చేపట్టే రైతులు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడీఏ వైవీ గంగాధర్ చెప్పారు. మండలంలోని రాచపల్లిలో భారీ వర్షాలతో నీట మునిగిన పంట పొలాలు, వరి నాట్లకు సిద్ధం చేసిన పొలాలను శుక్రవారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కాకినాడ సిటీ, జూలై 19: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకరమైన భోజనం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ కాకినాడ జిల్లా ప్రొఫెషనల్ వింగ్ చైర్మన్ వనమాడి మోహనవర్మ, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు అన్నారు. కాకినాడ జగన్నాథపురం ఎన్టీఆర్‌నగర్, అన్నమ్మఘాటీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన సదుపాయాలను శుక్రవారం పరిశీలించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు గొరుసు వెంకటదుర్గారావు, మల్లాడి దుర్గాప్రసాద్, పాలిక నాని, మేడిశెట్టి చిన్ని, గెడ్డం పూర్ణ, రవివర్మ, వెంకటేశ్వరరావుచౌదరి పాల్గొన్నారు.

అరుణాచలానికి స్పెషల్ బస్సులు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 19: కాకినాడ నుంచి అరుణాచలం స్పెషల్ బస్సు శుక్రవారం బయలుదేరింది. ఈ సందర్భంగా కాకినాడ బస్టాండ్‌లో డిపో మేనేజర్ ఎంయూ మనోహర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. యాత్రలో కాణిపాకం, శ్రీపురం దర్శనం చేసుకుని అరుణాచలం వెళ్లి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత కంచి, కాళహస్తి వెళ్లి తిరిగి ఈనెల 22న కాకినాడ వస్తుందన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట బస్టాండ్ నుంచి అరుణాచలం బయలు దేరిన ఆర్టీసీ బస్సును శుక్రవారం ఏలేశ్వరం డిపో మేనేజర్ సత్యనారాయణ ప్రారంభించారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పాత భవనానికి హంగులు

జీజీహెచ్(కాకినాడ), జూలై 19: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల పారా క్లినికల్ లెక్చర్ గ్యాలరీ భవనాన్ని 1980 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ ఆధ్వర్యంలో వ్యయ, ప్రయాసలకోర్చి మెరుగులు దిద్ది నూతన భవనంగా మార్చారు. పూర్వ విద్యార్థులు పల్మనాలజీ వైద్యనిపుణులు డాక్టర్ శేషగిరిరావు, విశ్రాంత డీఎంహెచ్‌వో డాక్టర్ వారా వెంకట్రావు ఆధ్వర్యంలో జీజీహెచ్ ఎదురుగా ఉన్న పారా క్లినికల్ గ్యాలరీ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమేళనంలో తమ బ్యాచ్ ఈ భవనానికి పునర్నిర్మాణాన్ని చేపట్టాలన్ని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. అన్ని హంగులతో పూర్తయిన ఈ భవనాన్ని ఈనెల 21న ఆర్ఎంసీ పూర్వ విద్యార్థి, మాజీ వైద్య ఆరోగ్యశాఖామంత్రి కామినేని శ్రీనివాస్, డీఎంఈ డాక్టర్ నరసింహం, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ ప్రారంభిస్తారని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ 1980 పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'మినీ గోకులాలకు దరఖాస్తులు'

రౌతులపూడి, జూలై 19: పశువు మినీగోకులాలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల పశువైద్యాధికారి ముద్రగడ వీర రాఘవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు పశువులు మినీ గోకులం షేడ్‌కు యూనిట్ విలవ రూ.2లక్షల 15వేలుకాగా ఉపాధిహామి నిధులు లక్షా మూడువేల ఐదు వందలు రైతుల వాటా పదకొండు వేలు కట్టాలన్నారు. మరిన్ని వివరాలకు రైతులు పశువైద్యశాలలో కానీ, రైతు సేవాకేంద్రంలో సంప్రదించాలన్నారు.

మెట్ట గ్రామాలకు సాగునీటి అవస్థలు

» అధ్వానంగా పుష్కర కాలువ దుస్థితి » ఆందోళనలో రైతులు



పెద్దాపురం: పుష్కర కాలువను పరిశీలిస్తున్న రైతులు

పెద్దాపురం, జూలై 19: మండల పరిధిలోని ఐదు మెట్ట గ్రామాలకు సాగు నీటి గండం ఏర్పడిందని రైతులు ఆందోళన చేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం పుష్కర కాలువను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాలుతిమ్మాపురం, కొండపల్లి, సీబీ దేవం, ఆర్‌బీ పట్నం, ఆర్‌బీ కొత్తూరు గ్రామాల రైతులు సాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారని, పుష్కర ఎత్తిపోతల పథకం అధ్వానంగా మారడంతో మెట్ట రైతులు సాగునీటికోసం ఎదురుచూస్తున్నారన్నారు. సాంకేతిక లోపం కారణంగా ఎర్రంపాలెం ఎత్తిపోతల పథకం నుంచి నీరు లిఫ్టింగ్ లేకపోవడంతో సాగునీరు పంటలకు అందడంలేదని, ఖరీఫ్ నారుమడులు ప్రారంభం కావడంతో నీరు లభ్యత లేక రైతులు గగ్గోలు పెడుతున్నారన్నారు. రంగంపేట మండల పరిధిలోని మర్రిపూడితో కలిపి సుమారు 6వేల ఎకరాలకు నీరందాల్సి ఉందని, సకాలంలో నీరు అందకపోతే నారుమడులు ఎండిపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా వాలుతిమ్మాపురం నుంచి కొండపల్లి వరకూ ఉన్న పంట కాలువ అధ్వానంగా ఉందని, పిచ్చి మొక్కలు పెరిగిపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందన్నారు. అలాగే మట్టి పెళ్లలు విరిగి కాలులో పడిపోతున్నట్లు రైతులు రైతులు చెబుతున్నారు. దీనికి రక్షణగోడ నిర్మించాలని రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పుట్టా సోమన్న చౌదరి, సైనం సాల్మన్ రాజు, కంటిపూడి విష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకుమడుల మునక

కరప, జూలై 19: అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగా గత 2రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా గ్రామాల్లో ఆకుమడులు, ఊడ్చిన చేలు ముంపుబారిన పడ్డాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ఆవరణలు నీటమునిగాయి. డ్రైన్‌లు పొంగిపొర్లుతూ రోడ్లపైకి బురద చేరుతోంది. పలుచోట్ల రహదారులు, వీధుల్లో ముంపునీరు చేరడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కరప, కొరుపల్లి, జడ్.బావారం, అరట్లకట్ట, తదితర గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఏవీ రాజేష్ పర్యటించి ఆకుమడులను పరిశీలించి రైతులకు పలు సూచనలు జారీ చేశారు.

ముంపునకు గురైన వరినాట్లు

తాళ్లరేవు, జూలై 19: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వరినాట్లు ముంపునకు గురయ్యాయి. పోలేకుర్రు, పి.మల్లవరం, పటవల, కోరింగ, ఇంజరం, చొల్లంగి, జి.వేమవరం, గాడిమొగ, తాళ్లరేవు తదితర గ్రామాల్లో ఎదచేలు నీటమునిగాయి. వ్యవసాయశాఖ ఏడీ బాబూరావు, ఎవో ప్రశాంతి పి.మల్లవరం గ్రాంటులో నీటమునిగిన ఎదచేలను పరిశీలించి రైతుల సమస్యలను అధికారుల వివరించారు.

మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించాలి



సర్పవరం జంక్షన్: అవగాహన ర్యాలీలో ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, డీసీవో వెంకట్రావు

సర్పవరం జంక్షన్, జూలై 19: మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ కాకినాడ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.ప్రవీణ, జిల్లా బాలబాలికల సంరక్షణ అధికారి కె.వెంకట్రావు అన్నారు. శుక్రవారం తిమ్మాపురం అంగన్‌వాడీ సెంటర్‌లో కాకినాడ రూరల్ సీడీపీవో వై.లక్ష్మి ఆధ్వర్యంలో మహిళలు,బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు, బాలికలపై లైంగిక దాడులకు పాల్పడటం దారుణమన్నారు. సమాజంలో ఉన్న మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడుల నివారణ కోసం ప్రభుత్వం పటిష్ట రక్షణ చట్టాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ చట్టాలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పిల్లల నడవడిక, అలవాట్లపై తల్లిదండ్రుల నిరంతర పర్యవేక్షణ కలిగి ఉండాలన్నారు. మహిళలు, బాలబాలికల కోసం ఉన్న రక్షణ, హక్కులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ కార్యదర్శి ప్రియాంక మయూరి, అంగన్‌వాడీ టీచర్లు పీఏఎస్ లత, శంకుతల, రాజేశ్వరి, బి.జ్యోతి, ఐ.సురేఖ, ఎస్ జగదీశ్వరి పాల్గొన్నారు.

పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు

కార్పొరేషన్(కాకినాడ): స్థానిక ఏఎస్‌డీ ప్రభుత్వ కళాశాలలో మిషన్ శక్తి వందరోజుల కార్యక్రమంలో భాగంగా మహిళలు, బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ట్ డబ్ల్యుడీసీడబ్ల్యు పీడీ కె.ప్రవీణ హాజరై చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో జ్యోతి, డీసీపీవో వెంకటరావు, శైలజ, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఉన్నారు.

కొత్తపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొమరగిరి శివారు ఆనందనగరంలో మహిళలు, బాలల హక్కులపై అవగాహన ర్యాలీని సీడీపీవో దుర్గాదేవి పారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో నిత్యం మహిళలు, బాలలపై అరాచకాలు జరుగుతున్నాయన్నారు. భారత రాజ్యాంగం మహిళలు, బాలల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించిందని చెప్పారు. ర్యాలీలో కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్ దిలీప్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సారమ్మ, జి.సుజాత, ఎంఎల్‌పీ ప్రశాంతి, కొమరగిరిసెక్టార్ మహిళలు,పెద్దలు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని వీరవరం పీహెచ్‌సీలో మహిళలు, బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ తోట రవి, సీడీపీవో ఎం.పూర్ణిమ, ఎంపీడీవో రాజేశ్వరరావు హాజరయ్యారు. మహిళలు, బాలల హక్కులు, వివిధ చట్టాలపై వివరించారు. సర్పంచ్ అంబటి బొజ్జమ్మ, బీజేపీ కంట కాశీవిశ్వనాథం, దొడ్డ అప్పారావు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు ఉన్నారు.

శాకంబరిగా బాలాత్రిపురసుందరి



పోర్టుసిటీ (కాకినాడ), జూలై 19: దేవాలయం వీధిలోని పురాతన బాలాత్రిపురసుందరి సమేత భీమేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ ఈవో రాపర్తి రాజేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి కార్తీక్ తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో టీడీపీ సీనియర్ నాయకుడు గ్రంథి బాబ్జి, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడెవల్లి విజయ రాజు, జిల్లా అధికారి సుబ్రహ్మణ్యం, తనిఖీదారు ఇ.ఫణీంద్రకుమార్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే నానాజీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 19: కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ షాన్‌మోహన్‌ను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం అభివృద్ధిపై ఇద్దరూ చర్చించారు. నియోజకవర్గంలో సమస్యలను ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

ఎమ్మెల్యే నానాజీకి కృతజ్ఞతలు

సర్పవరం జంక్షన్, జూలై 19: వైసీపీ హయాంలో వాకలపూడిలో కబ్జాకు గురైన 4.86 ఎకరాల భూమిని ఆక్రమణ చెర నుంచి భూమిని స్వాధీనం చేసుకునేలా సహకారం అందించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి వారాహి కాలనీ ప్లాట్ల యాజమానులు శుక్రవారం గొడారిగుంటలో కలిసి పండ్ల బుట్లను అందించి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



జగ్గంపేట, జూలై 19: జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ జన్మదినం సందర్భంగా శుక్రవారం జగ్గంపేటలోని భవిత ప్రత్యేక అవసరాల గల పిల్లల పాఠశాలలో విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేసి పాఠ్యపుస్తకాలు, మెటీరియల్ పంపిణీ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కృష్ణవేణి థియేటర్ వద్ద నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో భారీ కేకే కట్ చేశారు.

దొరికిన బంగారం అందజేత

జగ్గంపేట, జూలై 19: దొరికిన బంగారాన్ని మండలం పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెలిసేటి రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం రియల్ఎస్టేట్ రాజు పాస్టర్ విలీషా రాజు ఎన్వియర్ చక్రవర్తి పోలీస్‌స్టేషన్లో సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ బలరాం, నూకరాజు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో బాధితులకు అందజేశారు. కాట్రావులపల్లి వెళ్తుండగా మార్గమధ్యలో రోడ్డుపై పర్సు కనిపించడంతో రూ.70వేలు ఖరీదు చేసే బంగారం ఉండడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని పాస్టర్లు తెలిపారు. ఆ పర్సులో ఉన్న బిల్లు ఆధారంగా వివరాలు తెలుసుకుని శుక్రవారం బాధితులకు అప్పగించారు.

ఆలయానికి ధారా పాత్ర వితరణ

ఏలేశ్వరం, జూలై 19: మండలంలోని సిరిపురం శివాలయానికి ధారా పాత్ర, ఇత్తడి దీపారాధన కుంది బహూకరించారు. శుక్రవారం శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయానికి దాతలు సాగి బంగార్రాజు 13 కిలోల దీపారాధన కుంది, వెలుగెరి హరిరామ్ ధారా పాత్ర అందజేశారు.